RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...

సంపుటి - 1 సంచిక - 180 గురువారం 28 మార్చి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## ఉప్పల్‌లో పరుగుల మోత ...



4లో.




# మరో నలుగురు

**నిజామాబాద్ నుంచి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మెదక్ నుంచి నీలం మధు ముదిరాజ్, ఆదిలాబాద్ నుంచి ఆత్రం సుగుణ, భువనగిరి నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలకు అవకాశం**

**వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ స్థానాలకు ఇంకా కొలిక్కిరాని అభ్యర్థిత్వాలు**

**మార్చి 27(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్, ఢిల్లీ:** రాష్ట్రంలో మరో నాలుగు లోక్‌సభ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ బుధవారం రాత్రి అభ్యర్థులను ప్రకటించింది. నిజామాబాద్ నుంచి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మెదక్ నుంచి నీలం మధు ముదిరాజ్, ఆదిలాబాద్ నుంచి ఆత్రం సుగుణ, భువనగిరి నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలకు అవకాశం కల్పించారు. దీంతో రాష్ట్రంలో ఖమ్మం, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ స్థానాలు మినహా మిగతా వాటికి అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది. అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) బుధవారం దిల్లీలో సమావేశమై చర్చించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో తెలంగాణతోపాటు ఉత్తర్‌ప్రదేశ్, ఝార?ండ్, మధ్యప్రదేశ్, గోవా



అభ్యర్థుల ఎంపికపై చర్చించారు. పార్టీ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ, సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపా దాస్‌మున్షీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.




సమావేశం అనంతరం గోవా మినహా మిగిలిన 4 రాష్ట్రాల్లోని 14 స్థానాలకు అభ్యర్థుల పేర్లతో జాబితాను పార్టీ విడుదల చేసింది.

తాజాగా ప్రకటించిన అభ్యర్థుల్లో జీవన్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నుంచి పోటీచేసి ఓడిపోయారు. సుదీర్ఘకాలంగా పార్టీలో పనిచేస్తున్న ఆయన పేరుపై సీఈసీలో ఏకాభిప్రాయం వచ్చినట్లు తెలుస్తోంది. జీవన్‌రెడ్డి మినహా మిగిలిన ముగ్గురు అభ్యర్థులు పార్లమెంటుకు పోటీచేయడం ఇదే తొలిసారి. నీలం మధు ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పటాన్‌చెరు టికెట్ ఆశించినా చివరిక్షణంలో దక్కకపోవడంతో బీఎస్పీ తరఫున పోటీచేసి ఓడిపోయారు. బీసీ కోటాలో ఆయనను ఇప్పుడు మెదక్ అభ్యర్థిగా ఎంపిక చేశారు. ఆదిలాబాద్ అభ్యర్థిగా ఆత్రం సుగుణనే ఎంపిక చేసినా.. పొరపాటున తొలుత డాక్టర్ సుగుణకుమార్ చెలిమల అని జాబితాలో ప్రకటించి.. తర్వాత సవరించారు. సుగుణ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉన్న పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి భువనగిరి నుంచి అవకాశం ఇచ్చారు.

# మారిన కాలంతో పాటు కోర్టుల్లోనూ మార్పులు


**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్**

**రాజేంద్రనగర్‌లో నూతన హైకోర్టు నిర్మాణానికి సీజేఐ శంకుస్థాపన**



**మార్చి 27(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:** తెలంగాణలో నూతన హైకోర్టు నిర్మాణానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ బుధవారం శంకుస్థాపన చేశారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ప్రాంతంలో నూతన హైకోర్టును నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీజేఐతో పాటు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే కూడా పాల్గొన్నారు. రాజేంద్రనగర్‌లో 100 ఎకరాల్లో హైకోర్టు భవన నిర్మాణంతో పాటు జడ్జిలకు నివాస గృహాలను కూడా నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా సీజేఐ మాట్లాడుతూ... నూతన హైకోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. బ్రిటిష్ కాలంలో కోర్టులు సార్వభౌమత్వాన్ని కలిగి ఉండేవని, మారిన కాలంతో పాటు కోర్టుల్లోనూ మార్పులు వస్తున్నట్లు చెప్పారు. యువత వేగంగా మార్పులను కోరుకుంటోందన్నారు. కింది కోర్టుల్లోనే కాదు... పైకోర్టుల్లో కూడా మౌలిక సౌకర్యాల కొరత ఉందన్నారు. న్యాయవ్యవస్థ విలువలు పెంపొందించేలా సీనియర్లు కృషి చేయాలని సూచించారు. సాంకేతిక యుగంలో కోర్టు కార్యకలాపాలకు ఇంటర్నెట్‌ను వాడుకోవాలన్నారు

# కేజ్రీవాల్ కోర్టులోనే నిజాలు వెల్లడిస్తారు



: భార్య సునీత గురువారం సాక్ష్యాధారాలతో వివరాలు వెల్లడి సీఎం కేజ్రీవాల్ తనతో చెప్పారన్న సునీత బుధవారం మీడియాకు వీడియో సందేశం విడుదల

2లో.

# తెలంగాణలో ప్రభుత్వ్వండుందా?

**ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

**ఎక్సైజ్ కానిస్టేబుళ్ల అవస్థలపై ఆర్ఎస్పీ ట్వీట్**

**నియామక పత్రాలిచ్చి శిక్షణకు పంపలేదని విమర్శ**

**మంత్రి జూపల్లి చేతులెత్తేశారంటూ ఆరోపణ**

**మార్చి 27(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:** 'తెలంగాణలో అసలు ప్రభుత్వమనేది ఉందా.. ఎవరికైనా దాని జాడ కనిపిస్తే కాస్త చెప్పండి' అంటూ బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బుధవారం ట్వీట్ చేశారు. ఎల్బీ స్టేడియంలో ఆర్భాటంగా సభ నిర్వహించి, ఎక్సైజ్ కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందజేశారు, ఆపై వారి విషయమే మరిచిపోయారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించారు. నియామక పత్రాలు అందుకుని నలభై రోజులు గడిచినా వారిని శిక్షణకు పంపలేదని మండిపడ్డారు. ఎక్సైజ్ కానిస్టేబుళ్లు గత నలభై



రోజులుగా త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారని చెప్పారు. ఈ విషయంపై ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వారు లేఖ రాశారని ఆర్ఎస్పీ చెప్పారు. సదరు లేఖ ఫొటోను ట్విట్టర్ లో పంచుకున్నారు. అయితే, మంత్రి మాత్రం తన చేతుల్లో ఏమీలేదంటూ జవాబిచ్చారని, ప్రభుత్వాన్నే అడగాలంటూ నిర్లక్ష్యంగా చెప్పారని ఆరోపించారు. అందుకే తెలంగాణలో ప్రభుత్వం ఎక్కడుందో వెతుకుతున్నామని, ఎవరికైనా కనిపిస్తే చెప్పాలంటూ వ్యంగ్యంగా ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# ప్రజల దృష్టి మరల్చేందుకే

## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం

**పదేళ్ల నిజానికి.. వంద రోజుల అబద్ధానికి మధ్య ఎన్నికలివి**

**13న చేవెళ్లలో కేసీఆర్ బహిరంగ సభ : కేటీఆర్**

**మార్చి 27(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల హామీలను వదిలేసిందని మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు.

ప్రజల దృష్టిని మరల్చేందుకే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తెరపైకి తీసుకొచ్చిందని ఆరోపించారు. పాలన చేతకాక స్కాములు, స్కీములు, ట్యాపింగ్‌ల పేరుతో డ్రామాలు ఆడుతోందన్నారు. పదేళ్ల నిజానికి.. వంద రోజుల అబద్ధానికి మధ్య జరుగుతున్న ఎన్నికలివి అని అభివర్ణించారు. 30 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కొంతమంది భారాస ఎమ్మెల్యేలతో కలిసి భాజపాలో చేరాలన్నది సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన అని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మల్కాజిగిరి, చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు, నేతలతో ఏర్పాటు చేసిన విస్తృతస్థాయి సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. "కేజ్రీవాల్ అరెస్టును రాహుల్ గాంధీ అన్యాయం అంటారు. అదే కేసులో ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేస్తే రేవంత్ కరెక్టే అంటున్నారు. రాహుల్ కరెక్టా లేదా రేవంత్‌రెడ్డి కరెక్టా అనేది కాంగ్రెస్ చెప్పాలి. రేవంత్‌రెడ్డికి సచివాలయంలో లంకెబిందెలు కనిపించాయో లేదో గాని.. నగరంలో ఖాళీ నీటిబిందెలు మాత్రం కనిపిస్తున్నాయి. భారాస ఒక్క లోక్‌సభ సీటు కూడా గెలవదని చేవెళ్ల సభలో సీఎం అడ్డగోలుగా మాట్లాడారు. దమ్ముంటే ఇప్పటికైనా



నాతో మల్కాజిగిరిలో పోటీకి రావాలి. ఆయనకు సవాల్‌ను స్వీకరించే దమ్ము లేదు. రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం సంక్షోభంలో చిక్కుకున్నా.. కరవుతో సతమతమవుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. రేవంత్‌రెడ్డి మొదలుకొని యూట్యూబ్ ఛానెళ్లలో అడ్డగోలుగా పార్టీపై, నాయకత్వంపై మాట్లాడేవారికి.. ఓటు ద్వారానే బుద్ధి చెబుదాం" అని కేటీఆర్ అన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుల కస్టడీపై తీర్పు రిజర్వు

**మార్చి 27(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుల కస్టడీపై నాంపల్లి కోర్టు తీ ర్పు రిజర్వ్ చేసింది. సంచల నం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇద్దరు అదనపు ఎస్‌పి లు, ప్రణీత్‌రావును కస్టడీకి కో రుతూ పంజాగుట్ట పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై న్యా యస్థానం బుధవారం విచారణ చేపట్టింది.



అదనపు ఎస్‌పిలు భుజంగరావు,తిరుపతన్న, ఎస్ఐబి మాజీ డిఎస్‌పి ప్రణీత్‌రావు ను ఐదు రోజులు కస్టడీకి ఇ వ్వాలంటూ పోలీసులు కోరా రు. ఈ విచారణలో కస్టడీ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయడానికి గడువు కావాలని నిందితులు తరపు న్యాయవాదులు మంగళవారం కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ వినతిని పరిగణనలోకి తీసుకున్న కోర్టు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించి తదుపరి విచారణ బుధవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు తాజాగా విచారణ జరిపిన న్యాయస్థానం కస్టడీ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ప్రణీత్‌రావును ఇప్పటికే ఓసారి కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించిన పోలీసులు, ఈ కేసుకు సంబంధించి కీలక వివరాలను రాబట్టారు. ఇప్పుడు నిందితులందరినీ ఒకేసారి ప్రశ్నిస్తే మరిన్ని వివరాలు తెలిసే అవకాశముందని భావించిన పోలీసులు, అదనపు ఎస్‌పిలు సహా ప్రణీత్ రావు కస్టడీ కోసం పిటిషన్ వేశారు. ఈ వ్యవహారంపై నిందితుల తరపు న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేశారు.

# 13న చేవెళ్లలో కెసిఆర్ బహిరంగసభ

**మార్చి 27(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:**
అధికారం, ఆస్తుల కోసమే ఎంపి రంజిత్ రెడ్డి బిఆర్ఎస్‌ను విడిచి ద్రోహం చేశారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపించారు. కవితపైన కేంద్ర ప్రభుత్వ సంస్థలు సోదాల పేరుతో దాడి చేసి.. అరెస్టు చేసిన రోజే..కాంగ్రెస్‌లో చేరిన స్వార్థపరుడు రంజిత్ రె డ్డి అని పేర్కొన్నారు. గతంలో ఎన్నికలకు ముందు అప్పటి మాజీ ఎంపీ వి శ్వేశ్వర్ రెడ్డి కూడా ఇలానే పార్టీ మారి వెళ్లారన్నారు. పార్టీ కన్నా తానే ఎక్కువ అనుకొని ఇతర పార్టీలోకి వెళితే ఫలితం ఏమైందో అందరికీ తెలుసన్నారు. ఒక పార్టీ కన్నా తానే పెద్ద అనే అహంకారం ఉన్న వ్యక్తులు రాజకీయాల్లో గెలవరని పేర్కొన్నారు. అదే నిజమైతే దేశంలో పార్టీలు ఉండవని, స్వతంత్ర అభ్యర్థులే గెలుస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రం జిత్ రెడ్డి కలిసినంత మాత్రాన కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో కలిసిపోతాయనుకోవడం వారి రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని కెటిఆర్ వ్యాఖ్యానించారు. చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్,



పార్లమెంట్ నియోజకవర్గం ఎంఎల్ఎలు, మాజీ ఎంఎల్ఎలతో బుధవారం తెలంగాణ భవన్‌లో సమావేశమైన కెటిఆర్ ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్‌లో చేరిన రంజిత్ రెడ్డిపై కెటిఆర్ విమర్శలు గుప్పించారు.
రంజిత్ రెడ్డి ఎవరో మన పార్టీ సీటు ఇచ్చి, గెలిపించుకున్న తర్వాతనే ప్రపంచానికి తెలిసిందని అన్నారు. ఆయన 2019లో రాజకీయాలకు కొత్త అయినా పార్టీలో ఉన్న ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి గెలిపించారని గుర్తు చేశారు. రాజకీయంగా పార్టీలో అత్యధిక ప్రాధాన్యత, నియోజకవర్గంలో స్వేచ్ఛ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయబోను, రాజకీయాల నుంచి తప్పుకుంటానని చెప్పి రంజిత్ రెడ్డి పార్టీకి ద్రోహం చేశారని మండిపడ్డారు. బిఆర్ఎస్ శ్రేణులే కాదు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ రంజిత్ రెడ్డికి పార్టీ ఏం తక్కువ చేసిందని, పార్టీకి మోసం చేసి వెళ్ళారని చర్చించుకుంటున్నారని అన్నారు. సొంతంగా అభ్యర్థి లేని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో గెలవడం అసాధ్యమని కెటిఆర్ తెలిపారు. ఏప్రిల్ 13న చేవెళ్లలో జరిగే బహిరంగ సభలో కెసిఆర్ పాల్గొంటారని చెప్పారు. రంజిత్ రెడ్డి పార్టీ వీడినందుకు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పార్టీ అవకాశం ఇచ్చినందుకే ఆయన సేవ చేశారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. అందరూ కలసికట్టుగా కృషి చేసి చేవెళ్లలో హ్యాట్రిక్ విజయం సాధించాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణకు ఏం చేశారు?

## : కాంగ్రెస్, బీజేపీలపై మల్లారెడ్డి ఆగ్రహం

**రెండు జాతీయ పార్టీలకూ తెలంగాణ ప్రజలను ఓటు అడిగే హక్కు లేదన్న మల్లారెడ్డి**
**బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు ఏ మొహం పెట్టుకొని ఓటు అడుగుతారు? అని మండిపాటు**
**అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేశామా? అని ప్రజలు బాధపడుతున్నారని వ్యాఖ్య**




**మార్చి 27(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:**
కాంగ్రెస్ పార్టీపై మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మరోసారి విమర్శలతో మండిపడ్డారు. బుధవారం ఆయన మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం ముఖ్యనేతల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు లోక్ సభ ఎన్నికల్లో గెలుస్తామని చెప్పుకుంటున్నాయని... కానీ తెలంగాణకు వారు చేసింది ఏమిటో చెప్పాలని నిలదీశారు. రెండు జాతీయ పార్టీలకూ తెలంగాణ ప్రజలను ఓటు అడిగే హక్కు లేదన్నారు. ఆ పార్టీల నేతలు ఏ మొహం పెట్టుకొని ఓటు అడుగుతారో చెప్పాలన్నారు.బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దేశ ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేశామా? అని ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని వ్యాఖ్యానించారు. అసలు ఆ పార్టీలకు తెలంగాణలో ఓటు బ్యాంకే లేదన్నారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఆయన సీఎం అయితేనే ప్రాజెక్టుల్లోకి నీళ్లు వస్తాయన్నారు.

# ఎన్ని కుట్రలు చేసినా భాజపా, భారాసలు గెలవలేవు

## మల్కాజిగిరిలో ఎక్కువ మెజార్టీ సాధించాలిముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**మార్చి 27(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:**
మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో మరోసారి ఘనవిజయం సాధించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.
ఈ నియోజకవర్గానికి చెందిన భారాస, తెలుగుదేశం పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు బుధవారం సీఎం నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాస్కీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గత లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరిలో తనకు వచ్చిన దాని కంటే ఎక్కువ మెజార్టీతో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు, ప్రజలను మభ్యపెట్టే చర్యలకు పాల్పడినా భాజపా, భారాసలు రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో గెలవలేవన్నారు. ఉనికి లేకుండా పోయే పార్టీలకు ఓట్లు వేసే బదులు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే కాంగ్రెస్ అభ్యర్థులను ప్రజలు బలపరచాలని కోరారు. ప్రజలతో



మమేకమయ్యేలా రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోందని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను ఎట్టిపరిస్థితుల్లో అమలు చేస్తామన్నారు. రానున్న రోజుల్లో తమ అడ్రస్ గల్లంతవుతుందనే భయంతోనే భాజపా, భారాస నాయకులు కాంగ్రెస్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పార్టీలో చేరినవారిలో తెదేపా నేత కృష్ణప్రసాద్, తెలంగాణ కమ్మ సంఘం నాయకులు బి.రవిశంకర్, అరికెపూడి ప్రసాద్(మేడ్చల్), బోడు వెంకటేశ్‌యాదవ్(కుత్బుల్లాపూర్), మాజీ కార్పొరేటర్లు శాలిని, పావనీరెడ్డి, రమణారెడ్డి, మాజీ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**అండగా ఉంటా: వీహెచ్‌కు సీఎం హామీ**

అన్ని విధాలుగా అండగా ఉంటానని మాజీ ఎంపీ వీహెచ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం టికెట్ ఆశించిన వీహెచ్.. తనకు వచ్చే అవకాశం లేదని భావించి కొద్దిరోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల మీడియా ముందు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వీహెచ్‌ను సీఎం బుధవారం తన నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు. అభ్యర్థుల ఖరారుకు పార్టీ అధిష్ఠానం అవలంబిస్తున్న విధానాన్ని వివరించారు. నాయకులందరం ఐక్యంగా ప్రచారానికి వెళ్లి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని అన్నారు. పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి ఈ సందర్భంగా ఉన్నారు.

# 6వ తేదీ నుంచి శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు




**మార్చి 27(జర్నలిస్ట్ వార్త)** శ్రీశైలం:
శ్రీశైలంలో ఏప్రిల్ ఆరో తేది నుంచి పదో తేది వరకు ఉగాది మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయ దేవస్థానం వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో కర్నాటక, మహారాష్ట్ర పాదయాత్ర భక్త బృందాలతో ఈవో పెద్దిరాజు సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐదు రోజుల పాటు జరగబోయే మహోత్సవాల సమయంలో భక్తులందరికీ కేవలం అలంకార దర్శనం మాత్రమే ఉండనున్నట్లు తెలిపారు. ఇక.. భక్తుల సందర్శనార్థం బుధవారం నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు రోజుకు నాలుగు విడతలుగా స్వామివారి స్పర్శ దర్శనానికి అవకాశం కల్పించనున్నట్లు ఈవో పేర్కొన్నారు. స్వామివారి స్పర్శదర్శనం కోసం వెళ్లే భక్తులకు రూ.500 టిక్కెట్టును ఒక్కొక్క విడతలో 1500 టిక్కెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉగాది ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీకి అనుగుణంగా క్షేత్రపరిధిలోని ఆలయంలోని ప్రదేశాలలో చలువపందిర్లు, మంచినీటి సౌకర్యం, శౌచాలయాలు, విద్యుత్ దీపాలు, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.ఉగాది ఉత్సవాల సమయంలో కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన స్వచ్ఛంద సేవకుల సేవలను దేవస్థానం వినియోగించుకుంటుందని ఆలయ అధికారులు తెలిపారు. లాటరీ పద్ధతిలో స్వచ్ఛంద సేవా బృందాలకు ఆలయం, క్షేత్రపరిధిలోని ప్రదేశాలలో కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఈ స్వచ్ఛంద సేవకులు మార్చి 29 నుంచి ఏప్రిల్ పదో తేది వరకు ఈ సేవలను అందించాలన్నారు. స్వామివారి ఆలయం, ముఖ మండపం, నంది మండపం, ధ్వజస్తంభం, అమ్మవారి ఆలయం, ఉచిత దర్శనం, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ఉచిత క్యూ లైన్, భక్తులు దర్శనానికి వేచి ఉండే క్యూ కాంప్లెక్స్, పుష్కరిణి, గంగా భవానీ స్నాన ఘట్టాలు, పాతాళ గంగ, హఠకేశ్వరం, సాక్షి గణపతి, లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాలు, అన్నదానం, వైద్యశాల, వంటి తదితర ప్రాంతాల్లో సేవలు అందించాల్సి ఉంటుందని తెలిపారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల దుర్వినియోగం కేసులో ఓ వ్యక్తి అరెస్ట్

## మెదక్ జిల్లా వాసి ఫిర్యాదుతో కేసు నమోదు   నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**మార్చి 27(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:**
మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావు వద్ద గతంలో పనిచేసిన నరేశ్ కుమార్ అనే వ్యక్తిని హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీసులు బుధవారం నాడు అరెస్టు చేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల దుర్వినియోగం కేసులో నరేశ్ కుమార్ ను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ నిధులు దుర్వినియోగం అయ్యాయని, అనర్హులకు చెక్కులు అందించారని మెదక్ జిల్లా నారాయణఖేడ్ కు చెందిన రవినాయక్ ఫిర్యాదు చేశారు. తనకు మంజూరైన రూ.5 లక్షల చెక్కును నరేశ్ కుమార్ కాజేశాడని ఆరోపించాడు. జూబ్లీహిల్స్




పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక విచారణ తర్వాత నరేశ్ కుమార్ తో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.బీఆర్ఎస్ హయాంలో హరీశ్ రావు మంత్రిగా ఉన్నప్పుడు ఆయన ఆఫీసులో నరేశ్ కుమార్, మరో ముగ్గురు సీఆర్ఎంఎఫ్ విభాగంలో తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేశారు. ఈ క్రమంలోనే చెక్కుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ప్రాథమికంగా ఆధారాలు లభించినట్లు సమాచారం. రవినాయక్ కు చెందిన రూ.5 లక్షల చెక్కును క్యాష్ చేసుకుని నరేశ్, వంశీ, వెంకటేశ్, ఓంకార్ లు పంచుకున్నట్టు భావిస్తున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో వారి దగ్గర మరికొన్ని సీఎంఆర్ఎఫ్ చెక్కులు దొరికినట్లు సమాచారం.

# తాళపత్ర పరిరక్షణ దేశ వ్యాప్తంగా జరగాలి

## సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్



**మార్చి 27(జర్నలిస్ట్ వార్త)** తిరుపతి :
వేల సంవత్సరాల క్రితమే మహర్షులు, పెద్దలు ఎంతో విజ్ఞానాన్ని, శాస్త్ర సాంకేతిక అంశాలను నిక్షిప్తం చేసిన తాళపత్రాలను పరిరక్షించే కృషి దేశవ్యాప్తంగా నిర్వహించాల్సిన ఆవశ్యకత ఉందనిసుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ డివై చంద్రచూడ్ అన్నారు. శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో వేద, వేదాంగా, ఆగమ, పురాణ, ఇతిహాస, న్యాయ , దర్శనాలకు సంబంధించిన తాళపత్రాల సంరక్షణ, డిజిటలైజేషన్ ప్రక్రియ, వాటి ప్రచురణలను ఆయన ఈరోజు పరిశీలించారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అత్యంత పురాతనమైన తాళపత్ర గ్రంథాలను గొప్పగా పరిరక్షిస్తున్నారని వేద విశ్వవిద్యాలయ నిర్వాహకులను ప్రశంసించారు. టీటీడీ ఇలాంటి వేద విశ్వవిద్యాలయాన్ని నడపటం, అందులో మన పురాతన సనాతన తాళపత్ర సంపదను సంరక్షించడం తనకు ఎంతో ఆనందం కలిగించిందని అన్నారు.

# కేజ్రీవాల్ కోర్టులోనే నిజాలు వెల్లడిస్తారు: భార్య సునీత

**మార్చి 27(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:**

ఢిల్లీ లిక్కర్ పాలసీ స్కాం పేరుతో కేంద్రం ఆడుతున్న నాటకానికి గురువారం కోర్టులోనే తెరదించుతానని కేజ్రీవాల్ తనకు చెప్పారని ఆయన భార్య సునీత వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించిన నిజానిజాలను, ఈ వ్యవహారానికి సంబంధించిన డబ్బు ఎక్కడికి వెళ్లిందనేది దేశ ప్రజలకు కోర్టు ద్వారా వెల్లడిస్తారని వివరించారు. ఈమేరకు బుధవారం మీడియాకు విడుదల చేసిన వీడియో సందేశంలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ భార్య, మాజీ ఐఆర్ఎస్ అధికారి సునీత కేజ్రీవాల్ తెలిపారు. రెండేళ్లుగా ఆప్ నేతల ఇళ్లపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు చాలాసార్లు దాడులు చేశారని, దాదాపు 250 సార్లకు పైగా తమ ఇళ్లల్లో సోదాలు చేశారని గుర్తుచేశారు. వందల కోట్ల స్కాం అని ఆరోపించిన అధికారులు ఇన్ని సోదాలు జరిపినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా గుర్తించలేదని గుర్తుచేశారు. సీఎం కేజ్రీవాల్ ను అరెస్టు చేయడం ద్వారా ఢిల్లీ ప్రజలను వేధించాలని చూస్తున్నారా? అంటూ కేంద్రంలోని బీజేపీ పెద్దలను సునీత నిలదీశారు. ఈడీ కస్టడీలో ఉన్నప్పటికీ ఢిల్లీ ప్రజలకు ఎలాంటి కష్టం కలగకూడదని కేజ్రీవాల్ భావిస్తున్నారు, తపన పడుతున్నారని చెప్పారు. రెండు రోజుల క్రితం నీటి సమస్యపై మంత్రి ఆతీశికి కేజ్రీవాల్ ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని సునీత గుర్తుచేశారు. మధుమేహంతో బాధపడుతున్నా, కస్టడీలో ఉన్నా సరే తన కష్టాన్ని కూడా పట్టించుకోకుండా ప్రజల కోసమే ఆలోచించే నేతను జైలుకు పంపించి ఏం సాధించాలని అనుకుంటున్నారని ఆమె ప్రశ్నించారు. ఈ కేసుకు సంబంధించిన డబ్బు ఎక్కడుందో కేజ్రీవాల్ న్యాయస్థానంలో చెబుతారు. అందుకు తగిన ఆధారాలు కూడా ఇస్తారని చెప్పారు. అంతేకాదు, కేజ్రీవాల్ శరీరం మాత్రమే కస్టడీలో ఉందని, ఆయన ఆత్మ ఢిల్లీ ప్రజలకు తోడుగా వెన్నంటే ఉందని చెప్పారని పేర్కొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులను వదిలిపెట్టే ప్రసక్తి లేదు

## : మంత్రి కొండా సురేఖ

**మార్చి 27(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:**
ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులను వదిలిపెట్టే ప్రసక్తి లేదని, తన భర్త కొండా మురళి ఫోన్‌ను కూడా ట్యాపింగ్ చేశారని తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ పతనం ప్రారంభమైందన్నారు. తన తండ్రి అధికారంలో ఉన్నప్పుడు కవిత మద్యం అక్రమ వ్యాపారం చేశారని ఆరోపించారు. అవినీతి సొమ్ముతో కేసీఆర్ కుటుంబం కోట్లకు పడగలెత్తిందన్నారు. కాళేశ్వరం అవినీతిలో బీజేపీకి వాటా ఉందని, మేఘా కృష్ణారెడ్డి బీజేపీకి వెయ్యి కోట్ల రూపాయలను పార్టీ ఫండ్‌గా ఇచ్చారని ఆరోపించారు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ఆ పార్టీ నోరు మెదపడం లేదన్నారు.

# ఎంపీ రంజిత్ రెడ్డిపై కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు..



**మార్చి 27(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:** చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్ లో చేరిన ఎంపీ రంజిత్ రెడ్డి పైన కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రంజిత్ రెడ్డి ఎవరో మన పార్టీ సీటు ఇచ్చి గెలిపించుకున్న తర్వాతనే ప్రపంచానికి తెలిసిందన్నారు. 2019లో రాజకీయాలకు కొత్త అయినా పార్టీలో ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి ఆయనను గెలిపించారన్నారు. రంజిత్ రెడ్డికి రాజకీయంగా పార్టీలో అత్యధిక ప్రాధాన్యతనిచ్చామన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయనని రాజకీయాల నుంచి తప్పుకుంటానని పార్టీకి చెప్పారని కేటీఆర్ తెలిపారు.కేవలం అధికారం, ఆస్తుల కోసమే రంజిత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీని విడిచి ద్రోహం చేశారన్నారు. కవితపైన కేంద్ర ప్రభుత్వ సంస్థలు సోదాల పేరుతో దాడి చేసి.. అరెస్టు చేసిన రోజే..కాంగ్రెస్‌లో చేరిన స్వార్థపరుడు రంజిత్ రెడ్డి అని కేటీఆర్ పేర్కొన్నారు.గతంలో ఎన్నికలకు ముందు అప్పటి మాజీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి కూడా ఇలానే పార్టీ మారి వెళ్లారన్నారు. పార్టీ కన్నా తానే ఎక్కువ అనుకొని ఇతర పార్టీలోకి వెళితే ఫలితం ఏమైందో అందరికీ తెలుసన్నారు. ఒక పార్టీ కన్నా తానే పెద్ద అనే అహంకారం ఉన్న వ్యక్తులు రాజకీయాల్లో గెలవరన్నారు. అదే నిజమైతే దేశంలో పార్టీలుండవని... స్వతంత్ర అభ్యర్థులే గెలుస్తారని కేటీఆర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రంజిత్ రెడ్డి కలిసినంత మాత్రాన కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో కలిసిపోతాయనుకోవడం వారి రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1 కేసీఆర్, ఏ2 కేటీఆర్..

### కాంగ్రెస్ నేత తీవ్ర ఆరోపణలు



**మార్చి 27(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏ1, ఏ2 ముద్దాయిలని మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత మధుయాష్కీ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో కానిస్టేబుల్ బదిలీ కావాలన్నా కేటీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే చేసేవారని ఆయన అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కి ప్రధాన కారణం వారిద్దరే అని.. వారికీ జైలు శిక్ష పడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని విమర్శించారు."తిండి లేకుండా బతకవచ్చు గానీ స్వేచ్ఛ లేకుండా బతకలేం.మానవ హక్కులను కాలారాస్తూ ట్యాపింగ్ చేయడం క్షమించరాని నేరం. భువనగిరి నుంచి నన్ను పోటీ చేయాలని రాజగోపాల్ రెడ్డి కోరారు. నన్ను గెలిపించుకునే బాధ్యత తాను తీసుకుంటానని రాజగోపాల్ అంటున్నారు.నాకు పోటీ చేయడం ఇష్టం లేదని చెప్పా. స్వాతంత్ర్యానంతరం దొరలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వారంతా నక్సలిజం వైపు మళ్లారు. ఉమ్మడి రాష్ట్రంలో కమ్మ,రెడ్లు రాజ్యమేలారు. తెలంగాణ వచ్చిన తర్వాత రావులు రాజ్యం ఏలారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా జరుగుతోంది" అని మధుయాష్కీ అన్నారు.

# తెలంగాణలో ఏడు ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన జై స్వరాజ్ పార్టీ..

### ఎంపీ స్థానాలతో పాటు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి పోటీ చేస్తున్నాం.. కాసాని శ్రీనివాసరావుగౌడ్..




**మార్చి 27(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:** :జై స్వరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఫౌండర్ కాసాని శ్రీనివాసరావు గౌడ్ తెలంగాణలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల్ని బుధవారం మెట్టుగూడ సికింద్రాబాద్ లో ఉన్న పార్టీ కార్యాలయంలో ప్రకటించారు. మల్కాజిగిరి నుండి బత్తుల వెంకటేష్ గౌడ్,కరీంనగర్ నుంచి దుంబాల పరశురాములు గౌడ్, సికింద్రాబాద్ నుంచి ఆర్.ఎస్.జె థామస్, మహబూబ్నగర్ నుంచి మార్ల ఆంజనేయులు, చేవెళ్ల నుంచి మహమ్మద్ ఉస్మాన్, జహీరాబాద్ నుంచి మహమ్మద్ ముస్తఫా,భువనగిరి నుంచి పురం సంతోష్ కుమార్ లతో పాటు యిదే కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జీలని కూడా ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ లోని పార్లమెంటు స్థానాలతో పాటు అన్ని శాసన స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తున్నట్లు కాసాని ప్రకటించారు. హైదరాబాద్ జిల్లా ఇంచార్జిగా గుర్రం కృష్ణ, సంగారెడ్డి జిల్లా ఇంచార్జిగా లక్ష్మీ నారాయణ గౌడ్ ని ప్రకటించారు. త్వరలోనే మిగితా పార్లమెంట్ అభ్యర్థులని కూడా ప్రకటిస్తామని పార్టీ అధ్యక్షుడు కాసాని శ్రీనివాస రావ్ గౌడ్ తెలిపారు.సభలో పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తామని జై స్వరాజ్ పార్టీ గెలుపే తమ ధ్యేయం అని ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో జై స్వరాజ్ పార్టీ కార్మిక సంఘం గోలుకొండ రత్నం,పార్టీ నేషనల్ కోఆర్డినేటర్ శివ కుమార్,పార్టీ నాయకులు ప్రభు, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సోషల్ మీడియా ఇంఛార్జి నవీన్, మానుకోట జిల్లాకు చెందిన బోడ నంద, తేజావత్ రాములు, తేజావత్ రవి,చిర్ర లింగయ్య,మేడ్చల్ జిల్లా నాయకుడు క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బండి పర్యటన.. ఉద్రిక్తత



**మార్చి 27(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:** %అమాయకులపై దాడులు చేసిన దుండుగలను వదిలేసి ఆత్మరక్షణ కోసం అడ్డుకున్న బాధితులపై హత్యాయత్నం కేసు నమోదు చేయడంపై బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపి బండి సంజయ్ కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. బుధవారం మేడ్చల్ జిల్లాలోని చెంగిచర్ల విచ్చేసిన ఆయన అక్కడ పోలీసులు బారికేడ్లు విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చెంగిచర్ల నిషేధిత ప్రాంత మా మనం పాకిస్తాన్‌లో ఉన్నమా, బంగ్లాదేశ్ లో ఉన్నామా బాధితులంతా పేదలు. తిండికి లేక అల్లాడుతున్నవాళ్లు వాళ్లను ఆదుకోవడానికి వచ్చే వాళ్ల ను కూడా అడ్డుకుంటారా అంటూ ధ్వజమెత్తారు. దాడులకు గురైన బాధితులను పరామర్శించేందుకు వస్తున్నారని తెలియడంతో వేలాది మంది బిజెపి కార్యకర్తలు, హిందుత్వ వాదులు తరలివచ్చారు. జై శ్రీరాం నినాదాలు చేస్తూ బండి సంజయ్‌తో కలిసి బాధితుల వద్దకు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు బారికేడ్లు అడ్డుగా పెట్టారు. దీంతో ఆగ్రహానికి గురైన కార్యకర్త లు బారికేడ్లను తోసేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. పలువురు కార్యకర్తలకు, పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. తోపులాటలో బండి సంజయ్ పడిపోతుండగా కార్యకర్తలు పట్టుకున్నారు..

అనంతరం పోలీసుల ఆంక్షల మధ్య కొద్దిమంది కార్యకర్తలతో కలిసి బండి సంజయ్ బాధితుల ఇండ్ల వద్దకు వెళ్లి పరామర్శించి దాడులకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బండి సంజయ్ బాధితులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ చెంగిచర్లలో జరిగిన వాస్తవాలను బయటకు వెళ్లకుండా పేద ప్రజలదే తప్పు అన్నట్లుగా పోలీసులు, కొందరు చిత్రీకరించే యత్నం చేస్తున్నారని, నిజాం పాలనలో మహిళలపై అకృత్యాలకు జరిగాయని, కెసిఆర్ పాలనలో రజాకార్ల పాలనను చూపించారని విమర్శించారు. హెూలీ పండుగ రోజు భక్తి పాటలతో అమ్మవారిని కొలిచే సాంప్రదాయం ఇక్కడి ఎస్టీ సామాజికవర్గ ప్రజలకు ఉందని, కానీ కొందరు రోహింగ్యాలు, పోకిరీలు ఇక్కడికి వచ్చి పాటలు ఆపాలంటూ బెదిరించి, వందల మంది సంఘ విద్రోహ శక్తులు మూకుమ్మడిగా బాధితుల ఇండ్లపైకి వచ్చి మరణాయుధాలతో దాడి చేశారని మండిపడ్డారు. వాళ్ల దాడిలో పలువురికి తీవ్ర గాయాలైనట్లు, బాధితులు మసీదుకు, రోహింగ్యాలు ఉన్న ప్రాంతానికి వెళ్లలేదని, వాళ్లే బాధితుల వద్దకు వచ్చి దౌర్జన్యం చేసి చిన్నా పెద్దా మహిళలనే తేడా లేకుండా విచక్షణా రహితంగా దాడులు చేశారన్నారు

# మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేడు



**మార్చి 27(జర్నలిస్ట్ వార్త) మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు.దీనికోసం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 10 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఆయా పురపాలక సంఘాల కౌన్సిలర్లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, ఎక్స్‌అఫీషియో సభ్యులు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 1,439 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్, వీడియోగ్రాఫర్ల ద్వారా ఎన్నికల అధికారులు ఓటింగ్ సరళిని పరిశీలిస్తారు.ఓటింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను మహబూబ్‌నగర్ బాలుర జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరచనున్నారు. ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఈ ఉప ఎన్నిక కోసం మన్నె జీవన్‌రెడ్డి(కాంగ్రెస్), నవీన్‌కుమార్‌రెడ్డి(భారాస), సుదర్శన్‌గౌడ్(స్వతంత్ర అభ్యర్థి) బరిలో ఉన్నారు. గత వారం రోజులుగా ప్రధాన పార్టీలకు చెందిన ఓటర్లు గోవా క్యాంపులో ఉన్నారు. వీరంతా బుధవారం కర్ణాటకకు చేరుకున్నారు. పోలింగ్ సమయానికి కేంద్రాలకు వచ్చేలా ప్రధాన పార్టీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న కసిరెడ్డి నారాయణరెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన ఎమ్మెల్సీకి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.

# దానం నాగేందర్‌కు వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్



**మార్చి 27(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:** దానం నాగేందర్‌కు వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆయనపై అనర్హత వేటు వేయాలని నగరానికి చెందిన రాజు యాదవ్ అనే వ్యక్తి ఆ మేరకు పిటిషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీపై గెలుపొందిన దానం నాగేందర్ ఖైరతా బాద్ ఎంఎల్ఎగా కొనసాగుతున్నారు. కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్ సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థిగా బరి లో ఉన్నారు. ఒక పార్టీ నుంచి ఎంఎల్ఎగా గెలిచి రాజీనామా చేయకుండా మరో పార్టీ నుంచి ఎంపిగా పోటీ చేయడం చట్ట పరంగా రాజ్యాం గ విరుద్ధమని పిటిషనర్ అన్నారు. దానం నాగేందర్‌పై స్పీకర్ చర్యలు తీసుకోవాలని కోరుతూ పిటిషన్‌లో పేర్కొన్నారు. దానంపై అనర్హత వేటు వేయా ల్సిందిగా స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్‌ను కోరారు. కాగా దీనిపై గురువారం హైకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది. బిఆర్ఎస్ పార్టీ సైతం ఇప్పటికే ఈ విషయమై స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. మంగళవారం కెటిఆర్ సైతం ఈ విషయమై స్పందించారు.కాంగ్రెస్ ఎంపి అభ్యర్థిగా దానంను ప్రకటించడంతో ఆయనను స్పీకర్ అనర్హుడిగా గుర్తించాలని కోరారు. ఈ విషయమై స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలన్నారు. రాజకీయ ఒత్తిడితో స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే సుప్రీంకోర్టు వరకు అయినా వెళ్లి న్యాయపోరాటం చేస్తామన్నారు. మరికొన్ని నెలల్లో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక రావడం ఖాయమన్నారు. ఇదిలా ఉండ గా దానం నాగేందర్ ఎన్నిక చెల్లదంటూ ఆయన ప్రత్యర్థి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. జస్టిస్ విజయసేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం విచారణకు స్వీకరించింది. దీనిపై దానం నాగేందర్‌కు నోటీసులు జారీ చేసింది. అయితే, దానం నాగేందర్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారని విజయారెడ్డి తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ఓటర్లకు డబ్బులు పంచారని, ఈ విషయంలో కేసులు నమోదయ్యాయని కోర్టుకు వివరించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం దానంకు నోటీసులు జారీ చేసింది.

# అసమర్థ పాలనతోనే కరవు పరిస్థితులు

### కరీంనగర్ లోక్‌సభ భారాస అభ్యర్థి వినోద్‌కుమార్



**మార్చి 27(జర్నలిస్ట్ వార్త): బెజ్జంకి, :** ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, అసమర్థ పాలనతోనే రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొన్నాయని కరీంనగర్ లోక్‌సభ భారాస అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ఆరోపించారు.పంటలు కాపాడుకునేందుకు, రుణాలు చెల్లించేందుకు రైతులు పడుతున్న కష్టాలు చూస్తే ఉద్యమ కాలం నాటి రోజులు గుర్తుకు వస్తున్నాయని అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా లక్ష్మీపూర్ శివారులో సాగునీరు అందక ఎండిన వరి, వడగళ్ల వానకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... ప్రాజెక్టుల్లో నీళ్లు నింపేందుకు ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నాలు చేయకుండా రాజకీయాలకే పరిమితమవుతోందని విమర్శించారు. మేడిగడ్డ వద్ద వెంటనే మరమ్మతు పనులు చేపట్టి కాఫర్ డ్యామ్ నిర్మించాలని, వృథాగా పోతున్న జలాలను ప్రాజెక్టులకు ఎత్తిపోయాలన్నారు. రూ.2 లక్షల రుణ మాఫీపై ప్రభుత్వం వెంటనే బ్యాంకులకు ఆదేశాలు ఇవ్వాలని... అధికారులు రైతులకు నోటీసులు

# ఆర్ బి ఐ మాజీ గవర్నర్ వార్నింగ్

ఆర్థిక వృద్ధికి సంబంధించి "హైప్"ను నమ్మి భారత్ పెద్ద తప్పు చేస్తోందని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ హెచ్చరించారు. దేశం దాని సామర్థ్యాన్ని చేరుకోవడానికి గణనీయమైన నిర్మాణాత్మక సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.



ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం ఎదుర్కోవాల్సిన అతిపెద్ద సవాలు శ్రామిక శక్తి, నైపుణ్యాలను మెరుగుపరచడం అని రఘురామ్ రాజన్ ఒక ఇంటర్వ్యూలో అన్నారు. ఈ సవాలును పరిష్కరించకుంటే యువత ప్రయోజనాలను కాపాడటంలో కష్టాలు పడాల్సి వస్తుందన్నారు. దేశంలోని 140 కోట్ల జనాభాలో సగానికి పైగా 30 ఏళ్లలోపు యువతే ఉన్నారన్నారాయన. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆశయాన్ని ఈ ఆర్బీఐ మాజీ గవర్నర్ కొట్టిపారేశారు. డ్రాప్-అవుట్ శాతం అధికంగా ఉండి పిల్లలలో చాలా మందికి హైస్కూల్ విద్య లేకపోతే ఆ ఆశయం గురించి మాట్లాడటమే వ్యర్థం అన్నారు. భారతదేశంలో అక్షరాస్యత రేట్లు వియత్నాం వంటి ఇతర ఆసియా దేశాల కంటే తక్కువగా ఉన్నాయన్నారు. స్థిరమైన ప్రాతిపదికన 8% వృద్ధిని సాధించడానికే దేశం మరింత ఎక్కువ పని చేయాల్సి ఉందన్నారు. దేశంలో ఉన్నత విద్య కోసం కంటే చిప్‌ల తయారీకి రాయితీలపై ఎక్కువ ఖర్చు చేసేందుకు మోదీ ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయాలను రఘురామ్ రాజన్ తప్పుపట్టారు. భారతదేశంలో కార్యకలాపాలను స్థాపించడానికి సెమీ-కండక్టర్ కంపెనీలకు రాయితీల కింద సుమారు రూ. 76 వేల కోట్లు కేటాయించగా ఉన్నత విద్య కోసం రూ. 47 వేల కోట్లనే కేటాయించడాన్ని ఎత్తి చూపారు.

## 'ఎక్స్' ప్రీమియంలో కొత్త ఫీచర్..


కాలిఫోర్నియా: బిలియనీర్ ఎలాన్ మస్క్‌కు చెందిన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రీమియం సబ్‌స్క్రైబర్లకు మరో కొత్త ఫీచర్ రానుంది. కృత్రిమ మేధ సంస్థ 'ఎక్స్ఏఐ' అభివృద్ధి చేసిన ఏఐ చాట్‌బాట్ గ్రోక్‌ను వచ్చేవారం నుంచి ప్రీమియం చందాదా రులందరికీ అందించనున్నట్లు మస్క్ మంగళవారం వెల్లడించారు. ఇప్పటి వరకు ఇది కేవలం ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రైబర్లకు మాత్రమే అందుబాటులో ఉంది. 'ఎక్స్'ను వాడుతున్న వారి సంఖ్య తగ్గిపోతున్నట్లు వార్తలు వస్తున్న తరుణంలో



మస్క్ ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు ఈ సామాజిక మాధ్యమానికి వాణిజ్య ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం సైతం పడిపోతున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సబ్‌స్క్రైబర్ల ద్వారా వచ్చే ఆదాయంతో నష్టాన్ని పూడ్చుకునేందుకు మస్క్ ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే తాజాగా గ్రోక్‌ను ఎక్స్‌కు అనుసంధానిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఫిబ్రవరి నాటికి అమెరికాలో ఎక్స్‌ను వాడుతున్న వారి సంఖ్య వార్షిక ప్రాతిపదికన 18 శాతం తగ్గినట్లు ఇటీవల సెన్సర్ టవర్ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఈ సామాజిక మాధ్యమాన్ని మస్క్ కొనుగోలు తర్వాత యూజర్ల సంఖ్య 23 శాతం పడిపోయినట్లు తెలిపింది. మరోవైపు చాట్‌జీపీటీ సహా మార్కెట్‌లో ఉన్న ఇతర ఏఐ చాట్‌బాట్‌లకు పోటీగా గ్రోక్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఎక్స్‌కు అనుసంధానించడం వల్ల ఈ చాట్‌బాట్‌కూ ఆదరణ పెరుగుతుందని మస్క్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# అదానీ చేతికి మరో నౌకాశ్రయం

**న్యూఢిల్లీ:** నౌకాశ్రయాల్లో గౌతం అదానీ ఏకచత్రాదిపత్యం మరింత పెరిగిపోయింది. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్ తాజాగా ఒడిస్సాలోని షాపూర్జీ పల్లోంజీ (ఎస్‌పి) గ్రూప్‌నకు చెందిన గోపాల్‌పూర్ నౌకాశ్రయాన్ని స్వాధీనం చేసుకుంది. ఇప్పటికే దేశంలో పశ్చిమ, తూర్పులోని దాదాపు 12 పోర్టులు, టెర్మినల్స్‌ను సొంతం చేసుకున్న అదానీ పోర్టుపోలియోలో మరొక్కటి చేరినట్లయ్యింది. మోడీ ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీ సహజ వనరులు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాల స్వాధీనాలను భారీగా పెంచుకున్న విషయం తెలిసిందే. గోపాల్‌పూర్ పోర్టును రూ.3,350 కోట్లకు అదానీకి విక్రయించినట్లు ఎస్‌పి గ్రూప్ మంగళవారం ప్రకటించింది. కాగా.. ఇందులోని ఎస్‌పి గ్రూపునకు చెందిన 56 శాతం వాటాను, 39 శాతం ఓరిస్సా స్టైవెడొరెస్ నుంచి అదానీ పోర్ట్స్ స్వాధీనం చేసుకుంది. ఒడిస్సాలో నిర్మాణ దశలో ఉన్న ఈ నౌకాశ్రయాన్ని ఎస్‌పి గ్రూప్ 2017లో కొనుగోలు చేసింది.



గోపాల్‌పూర్ పోర్టు వార్షిక సామర్థ్యం 20 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉంది. గ్రీన్‌ఫీల్డ్ ఎల్ఎన్‌జి రీగ్యాసిఫికేషన్ టెర్మినల్ ఏర్పాటుకు ఇటీవలే పెట్రోనెట్ ఎల్ఎన్‌జితో ఇటీవలే ఒప్పందం కుదుర్చుకుంది. ఈ పోర్టులోని 95 శాతం వాటాను స్వాధీనం చేసుకోవడం ద్వారా దీర్ఘకాలంలో భారీ రాబడి ఉంటుందని అదానీ పోర్ట్స్ అంచనా వేస్తోంది. రుణాలను తగ్గించుకొని కొత్త ప్రయాణాన్ని ప్రారంభించడానికి తమకు ఈ నిధులు సహకరించనున్నాయని ఎస్‌పి గ్రూప్ ప్రతినిధి పేర్కొన్నారు. తద్వారా భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా తమ కీలక వ్యాపారాలపై దృష్టి సారించే అవకాశం ఉంటుందన్నారు. 2021లో నౌకాశ్రయాల రంగంలోకి ప్రవేశించిన అదానీ గ్రూపు అనాతి కాలంలోనే దేశంలోని అత్యంత కీలకమైన ముంద్రాపోర్టు, కృష్ణపట్నం పోర్టు, కరైకల్ పోర్టు, హజీరా పోర్టు, ధామ్రా పోర్టు తదితర పోర్టులను స్వాధీనం చేసుకుంది. దేశంలోని మొత్తం నౌకాశ్రయ వ్యాపారంలో అదానీ 13 పోర్టులతో 24 శాతం వాటాను హస్తగతం చేసుకున్నారు.

## బిలియనీర్స్ జాబితాలో స్థానం.. కోర్టులో ఊరట

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ కుబేరుల జాబితాలో చోటు సంపాదించారు. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆయనకు చెందిన ఒక కంపెనీ డీల్ ఇటీవల పూర్తయింది.దాంతో ఆయన ఆస్తుల విలువ భారీగా పెరిగింది. ఫలితంగా బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్‌లో ప్రపంచంలోని తొలి 500 మంది



సంపన్నుల జాబితాలో ఆయన స్థానం సంపాదించారు. ఇటీవల జరిగిన పరిణామాల కారణంగా తాజా అంచనాల ప్రకారం ట్రంప్ సంపద విలువ 4 బిలియన్ డాలర్లు (రూ.33 వేల కోట్లు) పెరిగి 6.5 బిలియన్ డాలర్లకు(సుమారు రూ.54 వేల కోట్లు) చేరింది. గతంలో ఎప్పుడూ ఆయన ఆస్తుల విలువ ఈ స్థాయికి చేరలేదని మీడియా కథనాల ద్వారా తెలిసింది. ట్రంప్‌నకు చెందిన సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్' సంస్థ డిజిటల్ వరల్డ్ అక్విజేషన్ కార్ప్ (డీడబ్ల్యూఏసీ)తో విలీనం ప్రక్రియ పూర్తయింది. ఇది దాదాపు 29 నెలలుగా సాగుతూ వస్తోంది. మార్కెట్లో డీడబ్ల్యూఏసీ షేర్లు ఒకేసారి 35శాతానికి పైగా ర్యాలీ అయ్యాయి. దాంతో ట్రంప్ సంపద కూడా భారీగా పెరిగి 6.5 బిలియన్ డాలర్లకు చేరినట్లు సీఎన్‌బీసీ పేర్కొంది. విలీనం తర్వాత ఏర్పడ్డ కొత్త కంపెనీ నేటి నుంచి నాస్‌డాక్‌లో డీజేటీ పేరిట ట్రేడింగ్ కానుంది. ఆస్తులు పెరగడంతోపాటు ట్రంప్‌నకు భారీ జరిమానా విధింపు విషయంలో పై కోర్టులో ఊరట లభించింది. తన సంపదకు సంబంధించి గతంలో తప్పుడు లెక్కలు చెప్పినట్లు అభియోగాలు వచ్చాయి. దాంతో విచారణ జరిపిన అమెరికా కోర్టు ఆయనకు రూ.3,788 కోట్ల (45.4 కోట్ల డాలర్ల) జరిమానా విధించింది. ట్రంప్ తనపై వచ్చిన అభియోగాలను, దిగువ కోర్టు విధించిన జరిమానాను సవాలు చేస్తూ పై కోర్టును ఆశ్రయించారు. ఇటీవల దిగువ కోర్టు ఉత్తర్వు అమలు కాకుండా నిలిపివేయటానికి అప్పీల్స్ న్యాయస్థానం ఓ షరతు విధించింది. పది రోజుల్లో రూ.1,460 కోట్ల(17.5కోట్ల డాలర్ల)ను చెల్లించాలని స్పష్టం చేసింది. ఈ మొత్తాన్ని జమ చేస్తే రూ.3,788 కోట్లను వసూలు చేయకుండా నిలిపేసేలా ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పింది. దాంతో ట్రంప్‌నకు భారీ ఊరట లభించినట్లైంది.

## భారత్‌లో పెరిగిన కుబేరులు..

న్యూఢిల్లీ: భారత్‌లో అధిక ధరలతో సామాన్యుల ఆదాయాలు అడుగంటుకుపో తుంటే.. మరోవైపు కుబేరుల సంపద మాత్రం ఊహించని రీతిలో పెరిగిపోతోం ది. సంఖ్యా, ఆదాయ పరంగాను గతేదాది వీరి సంఖ్య భారీగా పెరిగడం గమనార్హం. కేవలం మూడు వందల లోపు మంది వద్ద దాదాపు రూ.80 లక్షల కోట్లు పైగా సంపద



పోగుబడిందని హురున్ రిస్ట్ లిస్ట్ రిపోర్ట్‌తో వెల్లడయ్యింది. సంపన్నులు ఏడాదికేడాదికి వేల కోట్లు పోగేసుకుంటున్నారని తేలింది. సోమవారం హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2024" పేరుతో హురున్ ఓ రిపోర్ట్‌ను విడుదల చేసింది. లిస్టెడ్ కంపెనీల షేర్ ఆధారంగా, అన్‌లిస్టెడ్ కంపెనీలకు సంబంధించి ఇన్వెస్టర్ రౌండ్‌ల విలువ ఆధారంగా ఈ జాబితాను రూపొందించింది. భారత్‌లో గతేదాది 2023లో కొత్తగా 94 మంది కుబేరులు జత కావడంతో మొత్తం వీరి సంఖ్య 271కి చేరింది. వీరి సంపద ఒక్క లక్ష కోట్ల డాలర్లు (దాదాపు రూ.83 లక్షల కోట్లు)గా ఉంది. ఆసియా ఖండంలోనే ముంబయి కుబేరులకు కేంద్రంగా మారింది. దేశ ఆర్థిక రాజ ధానిలో 92 మంది కుబేరులు ఉన్నారు. చైనాలోని బీజింగ్‌లో 91 మంది కుబేరులు నమోదయ్యారు. లండన్ తర్వాత కుబేరుల పట్టణంగా ముంబయి నిలిచింది. న్యూయార్క్‌లో 119 మంది కుబేరులుంటే, లండన్ నగర పరిధిలో 97 మంది ఉన్నారు. గతేదాది కాలంలో ముంబైలో కొత్తగా 26 మంది బిలియనీర్లు పుట్టుకొచ్చారు. ప్రపంచంలోనే టాప్-20 బిలియనీర్లలో ఇద్దరు భారతీయులు చోటు సంపాదించుకున్నారు. టాప్-10 స్థానంలో నిలిచిన రిలయన్స్ ఛైర్మన్ ముకేష్ అంబానీ వ్యక్తిగత సంపద 115 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.9.5 లక్షల కోట్లు) సంపదను కలిగి ఉన్నారు. గతేదాది అంబానీ సంపద 40 శాతం పెరిగింది. 15వ స్థానంలో ఉన్న అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతం అదానీ వ్యక్తిగత సంపద 86 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.7.16 లక్షల కోట్లు)గా హురున్ అంచనా వేసింది. ఇంతక్రితం ఏడాదితో పోల్చితే 33 బిలియన్ డాలర్లు ఎగిసింది. భారత్ నుంచి ఔషధ రంగంలో 39 మంది, ఆటోమొబైల్ నుంచి 27, కెమికల్స్ నుంచి 24 మంది చొప్పున బిలియనీర్లు ఉన్నారు. ప్రపంచ దేశాల్లో టెస్లా అధినేత ఎలన్ మస్క్ 231 బిలియన్ డాలర్ల సంపదతో మొదటి స్థానంలో నిలిచారు. అతని తర్వాత అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 185 బిలియన్ల నికర విలువ సంపదతో రెండో స్థానంలో ఉన్నారు.

# ఉప్పల్‌లో పరుగుల మోత ...

## . ఐపీఎల్ హిస్టరీలో అత్యధిక స్కోరు చేసిన సన్‌రైజర్స్

## 31 రన్స్ తేడాతో ముంబై ఇండియన్స్‌పై గ్రాండ్ విక్టరీ

## దంచికొట్టిన క్లాసెన్, హెడ్, అభిషేక్, మార్క్రమ్



**మార్చి 27(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:** హైదరాబాద్ : బౌండ్రీల జోరు... సిక్సర్ల హోరుతో ఉప్పల్ స్టేడియం ఊగిపోయింది. హెన్రిచ్ క్లాసెన్ (34 బాల్స్‌లో 4 ఫోర్లు, 7 సిక్స్‌లతో 80లి), ట్రావిస్ హెడ్ (24 బాల్స్‌లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 62), అభిషేక్ శర్మ (23 బాల్స్‌లో 3 ఫోర్లు, 7 సిక్స్‌లతో 63), మార్క్రమ్ (28 బాల్స్‌లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 42లి) సృష్టించిన పరుగుల సునామీలో ముంబై బౌలర్లు కొట్టుకుపోయారు. ఐపీఎల్‌లో అత్యధిక స్కోరు నమోదు చేసిన హైదరాబాద్ బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో 31 రన్స్ తేడాతో ముంబైపై గెలిచింది. టాస్ ఓడిన హైదరాబాద్ 20 ఓవర్లలో 277/3 స్కోరు చేసింది. తర్వాత ముంబై 20 ఓవర్లలో 246/5 స్కోరుకే పరిమితమైంది. తిలక్ వర్మ (64) టాప్ స్కోరర్. టిమ్ డేవిడ్ (42లి), ఇషాన్ కిషన్ (34), నమన్ ధీర్ (30) ఫర్వాలేదనిపించారు. అభిషేక్?కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.




ఇన్నింగ్స్ 4వ బాల్‌ను ఫోర్‌గా మలిచిన హెడ్?.. టిమ్? డేవిడ్ క్యాచ్ డ్రాప్ చేయడంతో బతికిపోయాడు. మయాంక్ (11) ఫోర్‌తో టచ్‌లోకి వచ్చినా ఎక్కువసేపు ఆడలేదు. 3వ ఓవర్‌లో హెడ్ 6, 6, 4, 4తో 22 రన్స్ దంచాడు. 5వ ఓవర్‌లో హార్దిక్ (1/46).. మయాంక్‌ను ఔట్ చేశాడు. తొలి వికెట్‌కు 45 రన్స్ పార్ట్‌నర్‌షిప్ బ్రేక్ అయ్యింది. ఇదే ఓవర్‌లో హెడ్ హ్యాట్రిక్ ఫోర్స్ కొట్టడంతో 13 రన్స్ వచ్చాయి. ఆరో ఓవర్‌లో అభిషేక్ సిక్స్‌తో ఖాతా తెరవగా, హెడ్ 4, 4, 6తో పవర్‌ప్లేలో 81/1 స్కోరు చేసింది. 7వ ఓవర్‌లో అభిషేక్ 6, 6, 6తో 21 రన్స్ దంచడంతో స్కోరు 100 దాటింది. 18 బాల్స్‌లోనే ఫిఫ్టీ పూర్తి చేసిన హెడ్‌ను 8వ ఓవర్‌లో కోయెట్జీ ఔట్ చేయడంతో రెండో వికెట్‌కు 68 రన్స్ భాగస్వామ్యం ముగిసింది. కొత్తగా వచ్చిన మార్క్రమ్ 4, 6తో చెలరేగాడు. 10 ఓవర్‌లో అభిషేక్ 4, 6, 6, 4తో 16 బాల్స్‌లోనే హాఫ్ సెంచరీ అందుకోవడంతో రైజర్స్ స్కోరు 148/2కు పెరిగింది. తర్వాతి ఓవర్‌లో సిక్స్ కొట్టి అభిషేక్ వెనుదిరగడంతో మూడో వికెట్‌కు 48 రన్స్ జతయ్యాయి. ఇక మార్క్రమ్‌తో కలిసి క్లాసెన్ హిట్టింగ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాడు. తర్వాతి 5 ఓవర్లలో 54 రన్స్ రావడంతో స్కోరు 202/3కి చేరింది. 17వ ఓవర్‌లో క్లాసెన్ 4, 6, మార్క్రమ్ 4 కొట్టారు. తర్వాతి ఓవర్‌లో సిక్స్‌తో క్లాసెన్ 23 బాల్స్‌లో ఫిఫ్టీ అందుకున్నాడు. 19వ ఓవర్‌లో 2 ఫోర్లు, లాస్ట్ ఓవర్‌లో 4, 6, 6 బాదడంతో నాలుగో వికెట్‌కు 116 రన్స్ సమకూరాయి.


భారీ టార్గెట్ ఛేజింగ్‌ను ముంబై కూడా దీటుగానే మొదలుపెట్టింది. రోహిత్ (26) 4, 6, 6 బాదితే, ఇషాన్ 4, 4, 6, 6, 6, 6 దంచాడు. కానీ 4వ ఓవర్‌లోనే షాబాజ్ (1/39)కు వికెట్ ఇవ్వడంతో తొలి వికెట్‌కు 56 రన్స్ భాగస్వామ్యం ముగిసింది. ఐదో ఓవర్‌లో కమిన్స్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టిన రోహిత్ తర్వాతి బాల్‌కే వెనుదిరిగాడు. తిలక్, నమన్ అండతో ముంబై పవర్‌ప్లేలో 76/2 స్కోరు చేసింది. 7వ ఓవర్‌లో ఈ ఇద్దరు చెరో సిక్స్‌తో 15 రన్స్ రాబట్టారు. ఆ వెంటనే తిలక్ 6, 4, నమన్ 6తో రెచ్చిపోయారు. 10వ ఓవర్‌లో తిలక్ మూడు సిక్స్‌లు బాదడంతో ముంబై 141/2తో నిలిచింది. 11వ ఓవర్‌లో ఉనాద్కట్ (2/47) ఈ జోడీని విడదీశాడు.

ఈ ఓవర్‌లో రెండు ఫోర్లు కొట్టిన నమన్ ఇచ్చిన క్యాచ్‌ను కవర్స్‌లో కమి న్స్ అందుకున్నాడు. మూడో వికెట్‌కు 84 రన్స్ భాగస్వామ్యం ముగిసింది. 12వ ఓవర్‌లో హార్దిక్ (24) 6, 4 టచ్‌లోకి వచ్చాడు. 24 బాల్స్‌లో ఫిఫ్టీ కొట్టిన తిలక్14వ ఓవర్‌లో సిక్స్ కొట్టి తర్వాతి ఓవర్‌లో వికెట్ ఇచ్చుకున్నాడు. దీంతో నాలుగో వికెట్‌కు 32 రన్స్ పార్ట్‌నర్‌షిప్ బ్రేక్ అయ్యింది. ఓవరాల్‌గా 15 ఓవర్లలో 185/4 స్కోరు చేసిన ముంబైకి చివరి 30 బాల్స్‌లో 90 రన్స్ అవసరమయ్యాయి. 16వ ఓవర్‌లో 5 రన్సే వచ్చినా, తర్వాతి ఓవర్లలో డేవిడ్ 6, 4, 6, 4, 6 దంచాడు. కానీ హార్దిక్ ఔట్‌కావడంతో సమీకరణం 12 బాల్స్‌లో 54గా మారింది. షెఫర్డ్ (15లి) 6, 4, 4 కొట్టినా ముంబై టార్గెట్‌ను అందుకోలేకపోయింది.

# హీరో ఎవరైనా వాళ్లిద్దరు మాత్రం ఫిక్స్..!



ప్రేక్షకుల ఆలోచన ధోరణి మారుతున్నా కొద్దీ వారిని అలరించేందుకు కొత్త కథలతో.. కొత్త పాత్రలతో వస్తున్నారు దర్శకులు. ఒకప్పుడు కథలో కథానాయకుడు ఒక్కడే ఉండేవాడు అతనే మెయిన్ లీడ్ గా ఉంటూ సినిమాను.. కథను నడిపించే వాడు కానీ మారిన స్టోరీ టెల్లింగ్ విధానంలో భాగంగా కథలో ఒక్కరు కాదు ఇద్దరు ముగ్గురు ప్రధాన పాత్రలుగా చేస్తూ వస్తున్నారు. ముఖ్యంగా ఇదివరకు హీరో పక్కన ఉండే వారు కేవలం అతని హీరోయిజాన్ని లేపడానికి.. అతను పంచులు వేస్తే పడడానికి మాత్రమే ఉండే వారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. కథలో హీరో ఒక్కడు కాదు ఇద్దరు ముగ్గురు ఉంటున్నారు. ప్రేక్షకులకు ఎంటర్టైనింగ్ అందించడమే ముఖ్య ఉద్దేశ్యం తో ప్రేక్షకుల కోసం ముగ్గురు ప్రధాన పాత్రలతో కథలు రాస్తున్నారు. అలాంటి కథలకు పేరుకి లీడ్ హీరో ఒకరిని పెడుతున్నా అతని పక్కన ఫ్రెండ్స్ పాత్రల్లో ఒక ఇద్దరిని తీసుకుంటున్నారు. కథలు.. పాత్రలకు తగినట్టుగా హీరోలు మారుతున్నా కూడా ఆ ఇద్దరు ఫ్రెండ్స్ మాత్రం మారట్లేదు. ఆ ఇద్దరు ఎవరో కాదు ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ. హీరో పక్కన ఉంటున్నారు కదా వీళ్లకి సైడ్ రోల్స్ అనుకుంటే పొరపడినట్టే.. కథలో భాగం అవుతూ వారి మార్క్ చాటుతున్నారు. ప్రియదర్శి ఒక పక్క సోలో సినిమాలు చేస్తూ సత్తా చాటుతుండగా మరోపక్క ఇలా హీరో పక్క పాత్ర అది కూడా కథలో కీలకం అనిపించే పాత్రలు చేస్తున్నారు. రాహుల్ రామకృష్ణ కూడా ఇలాంటి పాత్రలకు పెట్టింది పేరు. హీరో పక్కన సైడ్ రోల్ గా కాకుండా అతను కూడా ఒక హీరోగా తన మార్క్ చాటుతున్నాడు. జాతిరత్నాలు తో మొదలైన ఈ క్రేజీ కాంబో సినిమాలు వస్తూనే ఉన్నాయి. లేటెస్ట్ గా ఈ ఇద్దరు కలిసి చేసిన ఓం భీం బుష్ కూడా సూపర్ హిట్ అయ్యింది. శ్రీ విష్ణుతో పాటు కథలో కీలకంగా మారిన రాహుల్, ప్రియదర్శి పాత్రలు అద్భుతంగా పండాయి. ఆ ఇద్దరు లేకుండా శ్రీ విష్ణు ఒక్కడే నడిపించడం అన్నది కుదిరే పని కాదు. సో టాలీవుడ్ కి దొరికిన జాతిరత్నాలుగా ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ అటు కథానాయకుడికి సపోర్ట్ గా కథలో తాము కూడా బలంగా మారుతూ తమ సత్తా చాటుతున్నారు. ఇలాంటి కథలకు హీరో ఎవరైనా సరే వీళ్లిద్దరు మాత్రం ఫిక్స్ అనిపించేలా ప్రేక్షకుల మెప్పు పొందుతున్నారు.






## హీరోయిన్ ను సీక్రెట్ గా పెళ్ళి చేసుకున్న హీరో సిద్ధార్థ్!

బొమ్మరిల్లు హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితి రావు హైదరీ పెళ్ళి చేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. తెలంగాణలోని వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లో ఈరోజు బుధవారం (మార్చి 27) ఉదయం వీరి వివాహం జరిగినట్లుగా ప్రచారం జరుగుతోంది. శ్రీ రంగనాయకస్వామి ఆలయంలో గోప్యంగా జరిగిన ఈ వేడుకకు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు బంధు మిత్రులు మాత్రమే హజరైనట్లుగా కథనాలు వస్తున్నాయి. సిద్ధార్థ్ సూర్యనారాయణన్ - అదితి రావు హైదరి లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్నారని, త్వరలోనే పెళ్ళి చేసుకోబోతున్నారని చాలా కాలంగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. 2021లో 'మహా సముద్రం' చిత్రంలో కలిసి నటించిన సమయంలో వీరి మధ్య సాన్నిహిత్యం ఏర్పడిందని, చివరకు అది ప్రేమగా మారిందని బీ టౌన్ కోడై కూసింది. వీటిని సిద్ధార్థ్ - అదితి ఖండించకపోవడం, ఇద్దరూ ప్రేమ పక్షుల్లా తరచుగా చెట్టాపట్టాలేసుకొని తిరగడంతో ఈ జంట మధ్య వ్యవహారం నిజమేనని అందరూ ఫిక్స్ అయ్యారు. ఈ నేపథ్యంలోనే తాజాగా పెళ్ళి కూడా చేసుకున్నారని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అదితి రావు తల్లితండ్రులు వనపర్తి సంస్థానానికి చెందినవారు. 18వ శతాబ్దానికి చెందిన గొప్ప చరిత్ర కలిగిన ప్రసిద్ధ శ్రీ రంగనాయకస్వామి దేవాలయంతో వారి కుటుంబానికి సంబంధం ఉంది. అందువల్లనే ఇప్పుడు ఆ ఆలయంలో అదితి - సిద్ధార్థ్ లు వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారని సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అంతేకాదు తమిళనాడుకు చెందిన పూజారులు వీరి వివాహ వేడుకలను నిర్వహించారని అంటున్నారు. అయితే పెళ్ళి గురించి ఇప్పటి వరకూ అటు సిద్ధార్థ్ కానీ, ఇటు అదితి రావు కానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. రంగంలోకి బడా నిర్మాణ సంస్థ నిజానికి హీరో సిద్దార్థ్ కు గతంలో మేఘనా అనే అమ్మాయితో వివాహమైంది. కానీ వీరు నాలుగేళ్లకే విడాకులు తీసుకున్నారని టాక్. ఆ తర్వాత పలువురు హీరోయిన్లతో సిద్ధు ప్రేమాయణం సాగించినట్లు రూమర్స్ వున్నాయి. మరోవైపు అదితి రావు హైదరీకి కూడా 21 ఏళ్లకే పెళ్ళి జరిగింది. సత్యదీప్ మిశ్రా అనే బాలీవుడ్ నటుడిని ఆమె వివాహమాడింది. ఒక బాబుకు జన్మనిచ్చిన తర్వాత వీరిద్దరూ విడిపోయారు. అప్పటి నుంచీ ఒంటరి జీవితం గడుపుతోన్న అదితిపై అనేక డేటింగ్ రూమర్స్ వచ్చాయి. సిద్దార్థ్ తో పరిచయం తర్వాత అదితి మరోసారి ప్రేమలో పడిందని అప్పట్లో వార్తలు వైరల్ అయ్యాయి. ఈ క్రమంలో వీరిద్దరూ హీరో శర్వానంద్ నిశ్చితార్థానికి జంటగా హాజరయ్యారు. కలిసి రీల్స్ చేస్తూ సోషల్ మీడియాలో సందడి చేశారు. ఇన్నాళ్లకు ఇప్పుడు సిద్దార్థ్ - అదితి మూడు ముళ్ళ బంధంలో అడుగుపెట్టినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో నిజమెంతనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకూ ఆగాల్సిందే.

## అడవిలో హత్యలకు దెయ్యమే కారణమా?

### : ఉత్కంఠను పెంచుతున్న 'ఇన్ స్పెక్టర్ రిషి' సిరీస్





ఒక వైపున సినిమాలు చేస్తూనే మరో వైపున వెబ్ సిరీస్ లతో నవీన్ చంద్ర బిజీగా ఉన్నాడు. ఆయన నుంచి ప్రేక్షకుల ముందుకు రావడానికి మరో సిరీస్ రెడీ అవుతోంది. ఆ సిరీస్ పేరే 'ఇన్ స్పెక్టర్ రిషి'. ఈ సిరీస్ లో టైటిల్ రోల్ లో నవీన్ చంద్ర కనిపించనున్నాడు. సుఖ్ దేవ్ లాహిరి నిర్మించిన ఈ సిరీస్ కి, నందిని దర్శకత్వం వహించారు. తమిళంలో రూపొందిన ఈ సిరీస్ ను ఈ నెల 29వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ కానుంది. తమిళంతో పాటు తెలుగు .. మలయాళ .. కన్నడ .. హిందీ భాషల్లో ఈ సిరీస్ ను అందుబాటులోకి తెస్తున్నారు. ఒక వైపున హారర్ థ్రిల్లర్ .. మరో వైపున సూపర్ నేచురల్ థ్రిల్లర్ కలిసిన ఒక విలక్షణమైన జోనర్ ఇది. సీబీ సీఐడీ ఆఫీసర్ గా నవీన్ చంద్ర నటించిన ఈ సిరీస్ లో, సునైన .. కన్నారవి .. శ్రీకృష్ణ దయాళ్ .. జీవరత్నం .. కుమార్ వేల్ ఇతర ముఖ్యమైన పాత్రలలో కనిపించనున్నారు. ఒక అటవీప్రాంతంలో వరుస హత్యలు జరుగుతూ ఉంటాయి. ఆ కేసు విషయంపై ఆ ప్రాంతానికి ఇన్ స్పెక్టర్ రిషి వస్తాడు. అడవిలో తిరుగుతున్న ఒక దెయ్యం ఈ హత్యలకు కారణమని అక్కడి గిరిజనులు చెబుతారు. వాళ్ల మాటల్లో నిజం లేదని భావించిన రిషి, తన టీమ్ తో కలిసి అడవిలోకి వెళతాడు. అక్కడ అతనికి ఎలాంటి అనుభవాలు ఎదురవుతాయి?
అప్పుడు అతను ఏం
చేస్తాడు? అనేదే కథ


## డాక్టర్ కాబోయి హీరోయిన్ గా సెటిల

బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్.. సీతారామం మూవీతో టాలీవుడ్ కు పరిచయమైన విషయం తెలిసిందే. తెలుగులో ఫస్ట్ మూవీతో ఆడియన్స్ మదిలో చెరగని ముద్ర వేసుకుంది. తనకంటూ ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. సీతగా అందరి మనసులు దోచుకుంది. ఈ చిత్రం తర్వాత మృణాల్ కూడా వరుసగా తెలుగు సినిమాల్లోనే నటించేందుకు ఆసక్తి చూపిస్తోంది. గతేడాది హాయ్ నాన్నతో అలరించింది. ఈ సినిమాలో నేచురల్ స్టార్ నానికి జోడీగా నటించి మంచి మార్కులు కొట్టేసింది మృణాల్ ఠాకూర్. ఇక త్వరలోనే ఫ్యామిలీ స్టార్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రానుంది. రౌడీ హీరో విజయ్ దేవరకొండ సరసన మృణాల్ ఠాకూర్ నటిస్తున్న ఈ యాక్షన్ అండ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ వేసవి కానుకగా ఏప్రిల్ 5వ తేదీన రిలీజ్ అవ్వనుంది. ఇటీవల పలువురు టాలీవుడ్ మేకర్స్.. మృణాల్ తో చర్చలు జరిపినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. అయితే చాలా మంది బ్యూటీలు.. మోడల్ గా కెరీర్ స్టార్ట్ చేసి హీరోయిన్లుగా మారుతారు. ఈ విషయం అందరికీ తెలిసిందే. కానీ మృణాల్.. మాత్రం డాక్టర్ అవ్వాలనుకుని హీరోయిన్ గా మారిందట. డెంటిస్ట్ అవ్వాలని అందుకు సంబంధించి కోర్సులో జాయిన్ అయిందట. చదువు కన్నా యాక్టింగ్ పై మంచి ఇంట్రెస్ట్ ఉందట. యాక్టింగ్ చేయాలని అనుకుంటున్నట్లు ఎప్పుడు తన ఫ్రెండ్స్ తో చెప్పేదట మృణాల్. ఫస్ట్ ఇయర్ లో ఉన్నప్పుడు ఓ సారి ఎక్కడో ఆడిషన్ జరుగుతుందని మృణాల్ ఠాకూర్ కు ఆమె ఫ్రెండ్ చెప్పిందట. ఆడిషన్ కు వెళ్తే ఇప్పుడే ఛాన్స్ వచ్చేయదు, పిలవడానికి నాలుగు నెలల సమయం పడుతుందని కూడా చెప్పిందట. దీంతో మృణాల్ ఆడిషన్ కు వెళ్లిందట. కానీ అక్కడ ఆమె సెలెక్ట్ అవ్వడం, ఆ తర్వాత ఫస్ట్ మూవీలో నటించడం వెంట వెంటనే జరిగిపోయాయట. ఆ మూవీనే మరాఠీ సినిమా హలో నందన్. ఎలాంటి సినిమా బ్యాక్ గ్రౌండ్ లేకపోయినా.. అలా సినిమాల్లోకి వచ్చిందన్నమాట మృణాల్. అయితే ఈ విషయంపై మృణాల్.. గతేడాది హాయ్ నాన్న ప్రమోషన్స్ లో భాగంగా నానికి ఇచ్చిన స్పెషల్ ఇంటర్వ్యూలో చెప్పింది. ఫ్యామిలీ స్టార్ రిలీజ్ కు ముందు ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మృణాల్ డాక్టర్ అయింటే.. మంచి హీరోయిన్ ను మిస్ అయిపోయే వాళ్లమని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అయితే ఫ్యామిలీ స్టార్ తో మృణాల్.. తెలుగులో హ్యాట్రిక్ కొడుతుందో లేదో చూడాలి



## బిడ్డ పుట్టిన తరువాత తొలిసారిగా తిరుమలకు రామ్‌చరణ్ దంపతులు





బిడ్డ పుట్టిన తరువాత తొలిసారిగా రామ్ చరణ్ తాజాగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తన పుట్టిన రోజును పురస్కరించుకుని అత్తామామలు, భార్యాబిడ్డలతో కలిసి ఆయన తిరుమలకు వచ్చారు. స్వామివారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. మరోవైపు, రామ్‌చరణ్‌ను పలకరించేందుకు భక్తులు ఉత్సాహం చూపించారు. ఆలయం నుంచి బయటకు వచ్చిన రామ్‌చరణ్ దంపతులను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.